సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 30 । మార్చి । 2025

సిక్కోలు మణిపూసలకు ఉగాది పురస్కారాలు


రామకౌండిన్య | రాజారావు

శ్రీకాకుళం కల్చరల్, పొందూరు: శ్రీకూర్మంకు చెందిన శ్రీభాష్యం సుందర రామ కౌండిన్యకు ప్రభుత్వం ఉగాది పురస్కారాన్ని ప్రకటించింది. కూచిపూడి నాట్యంలో విశేష కృషి చేసినందున ఈ అవార్డుకు ఎంపికయ్యారు. పాతికేళ్లుగా కౌండిన్య రఘుపాత్రుని శ్రీకాంత్ వద్ద కూచిపూడి నాట్యంలో శిక్షణ పొందుతున్నారు. అలాగే జి.సిగడాం మండలంలోని ఆనందపురం అగ్రహారం మండల పరిషత్ యూపీ స్కూల్‌లో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తున్న వావిలపల్లి రాజారావు మాస్టారుకు కూడా ప్రభుత్వం ఉగాది పురస్కారం ప్రకటించింది. సాహిత్యం, కళలు, కవితలు, వ్యాసాల్లో ఆయన విశేష కృషి చేశారు. పొందూరు, రణస్థలం తదితర మండలాల్లో సుమారు 42 గ్రంథాలయాలు స్థాపించారు.



ఇఫ్తార్	సహర్
ఆది (సా)	సోమ (ఉ)
6.11	4.35



విశ్వావసుకు స్వాగతం

క్రోధి కాలగర్భంలో కలిసిపోయింది. విశ్వావసుకు స్వాగతం పలుకుతూ ప్రకృతి కొత్త చిగురు తొడిగింది. ఉదయాన్నే కోయిల కట్టే కొత్త రాగాలతో తెలుగు వారు నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తారు. షడ్రుచుల పచ్చడి ఆరగించి పంచాంగం వినడానికి సిద్ధమయ్యారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

ముగ్గురు అర్చకులకు జిల్లా స్థాయి ఉగాది పురస్కారాలు

అరసవల్లి: విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా జిల్లా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ వైదిక సేవలందించిన ముగ్గురు అర్చకులకు ఉగాది పురస్కారాలను అందించనున్నారు. ఈ మేరకు శనివారం జిల్లా దేవదాయ శాఖాధికారి ప్రసాద్ పట్నాయక్ వివరాలను వెల్లడించారు. ఆరవెల్లి శ్రీరామమూర్తి, (అర్చకులు, శ్రీ ఉమారుద్రకోటేశ్వర స్వామి ఆలయం, శ్రీకాకుళం), బాలక సత్యనారాయణ, (అర్చకులు, శ్రీచక్ర పెరుమాళ్ల స్వామి వారి ఆలయం, బెజ్జిపుట్టుగ, కవిటి,) పద్మనాభపాడి, (అర్చకులు, శ్రీజగన్నాథస్వామి వారి ఆలయం, కొల్లూరు, కంచిలి)లను జిల్లా స్థాయి అవార్డులకు ఎంపిక చేశామని, వీరికి ప్రోత్సాహం కింద రూ.10,116 నగదుతో పాటు ప్రశంసా పత్రాన్ని ఆదివారం అందజేయనున్నట్లుగా వివరించారు.

తీపి లేని ఉగాది



- అమలు కాని పథకాలు
- రైతులు, మహిళలు, నిరుద్యోగులకు నిరాశ

ఆరు రుచుల సమ్మేళనంగా తెలుగు ప్రజలు ఉగాదిని జరుపుకుంటారు. తీపి చేదుల కలయికే బతుకు అంటూ అంతరార్థాన్ని మిళితం చేసి ఉగాది పచ్చడి తయారు చేస్తారు. కానీ కూటమి ప్రభుత్వం తీపిని హరించి చేదును మాత్రమే మిగిల్చింది. సూపర్ సిక్స్ అంటూ పథకాలను ఆర్భాటంగా ప్రచారం చేసి.. తీరా అమలు సమయానికి చేతులెత్తేసింది. సమయానికి సాయం అందక అన్నదాతలు, ఖాతాల్లో నిధులు జమ కాక ఆడ బిడ్డలు, తల్లికి వందనం లేక విద్యార్థులు, భృతి రాక మత్స్యకారులు కొత్త ఏడాదికి ఆనందంగా ఆహ్వానం పలకలేకపోతున్నారు.

– సాక్షి ప్రతినిధి శ్రీకాకుళం,టెక్కలి, ఇచ్ఛాపురం రూరల్

'అన్నదాత సుఖీభవ' అనేదెప్పుడు..?

రైతు భరోసాను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దిగ్విజయంగా అమలు చేసింది. తేదీ చెప్పి మరీ ఖాతాల్లో సొమ్ములు జమ చేసింది. ఆ పథకాన్నే 'అన్నదాత సుఖీభవ'గా కూటమి నాయకులు మార్చారు. పేరు మార్చినంత సులభంగా డబ్బులు మాత్రం ఇవ్వలేకపోయారు. ఒక ఖరీఫ్, ఒక రబీ కూడా పూర్తయిపోయింది. అయినా చేస్తామన్న సాయం చేయలేదు.

ఆడ బిడ్డల నిధి ఎక్కడో..?

చేయూత పేరుతో ఐదేళ్ల పాటు వైఎస్ జగన్ ప్రభుత్వం ఆడపడుచులకు అండగా నిలిచింది. ఇది చూసి ఎన్నికల ముందు కూటమి నేతలు 18–59 ఏళ్ల మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇస్తామని హామీ ఇచ్చారు. జనం ఓట్లు వేశాక చెప్పిన మాటలన్నీ మర్చిపోయారు.

అడిగితే కస్సు'బస్సు'లు

'బస్సెక్కితే టికెట్ తీయకండి. అడిగితే నా పేరు చెప్పండి..' అంటూ ఆర్భాటంగా మాటిచ్చిన నాయకులు ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని మాత్రం ప్రారంభించలేకపోతున్నారు. ప్రచారంలో చూపిన ఉత్సాహం అమలులో చూపడం లేదు.

తల్లికి వందనం..

నీకు రూ.15వేలు, నీకు రూ.15వేలు అంటూ ఇంటింటా ఊదరగొట్టారు. కానీ విద్యా సంవత్సరం గడిచిపోయినా పథకాన్ని మాత్రం అమలు చేయలేదు. ఇక ఈ ఏడాది విద్యార్థులకు తల్లికి వందనం లేనట్టే అనే వార్తలు గట్టిగానే వినిపిస్తున్నాయి.

భృతి.. భ్రాంతి

నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి భ్రాంతిగా మారింది. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏలు, పీఆర్‌సీలు, ఐఆర్ ప్రకటనలూ లేవు.

పంచె'కట్టు బాటు'

ఇప్పుడంటే పండగలకు జీన్స్‌లు, టీషర్టు అంటూ హడావుడి పెరిగింది గానీ.. అచ్చ తెలుగు పండగంటే పంచె కట్టు మాత్రమే. ఎవరైనా పంచె కడితే ఆ ఇంటిలో శుభకార్యమని ఇట్టే తెలిసిపోయేది. మరీ ముఖ్యంగా ఉగాది నాడు పంచె కట్టుకుని పంచాంగ పఠనం వినడం మన కట్టుబాటు కూడా. అందుకే ఇప్పుడు రెడీమేడ్ పంచెలు కూడా రెడీ అయిపోయాయి.

– శ్రీకాకుళం కల్చరల్



అవధానం చేస్తున్నప్పటి నుంచే

నేను 2011లో విద్వాన్ శిక్షణ కోసం పొద్దుటూరు వెళ్లాను. తెలుగు పండిట్‌గా పనిచేశాను. ఇప్పటి వరకు 71 అవధానాలలో సమస్యాపూరణాలు చేశాను. నేను 2018 నుంచి పంచెకట్టడం అలవాటు చేసుకున్నాను. అప్పటి నుంచి ఎక్కడికి వెళ్లినా పంచె మాత్రమే కడతాను.

– పైడి హరనాథ రావు, అవధాని, శ్రీకాకుళం



30 ఏళ్లుగా పంచె కడుతున్నా

మాది తిరుపతి. గత 30 ఏళ్లుగా పంచె కడు తున్నాను. ఇస్కాన్ దీక్షలు తీసుకున్న ప్రతి ఒక్కరూ పంచె కట్టడం సంప్రదాయం. కాషాయం, తెలుపు రంగు పంచెలు కడుతుంటాం. ఇస్కాన్‌లో విదేశీయులు కూడా పంచె కట్టే ఆచారాన్ని పాటిస్తారు. ఇది తెలుగువారి సంప్రదాయం

– లక్ష్మీపతి గౌరదాస్, ఇస్కాన్ నిర్వాహకులు



సంప్రదాయాన్ని గౌరవించాలి

నా చిన్నతనం నుంచి మా తండ్రిగారు పంచె కట్టుకోవడం నేర్పారు. ప్రతి రోజు ఆలయానికి వెళ్లే సమయంలో కట్టుకోవడం అలవాటైంది. మా తండ్రిగారు కూడా పంచెకట్టుకునే వారు. ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాను.

– ఇప్పిలి శంకరశర్మ, ప్రధాన అర్చకులు, అరసవల్లి దేవాలయం

ఈకేవైసీ నమోదులో డీలరు చేతివాటం

పలాస: మండలంలోని కాంట్రగడ గ్రామ రేషన్ డీలరు బాలకృష్ణ రేషన్ లబ్ధిదారులకు ఈకేవైసీ నమోదు చేయించడంలో అవినీతికి పాల్పడుతున్నాడు. కొంత మంది స్థానికంగా లేకపోవడం, ఈ నెల 31లోగా గడువు ముగుస్తుందని చెప్పడంతో డిపోల వద్ద రద్దీ పెరుగుతోంది. ఇదే అదును చూసుకుని రేషను డీలర్లు లంచావతారాలెత్తుతున్నారు. లబ్ధిదారులు వారి అవసరం కొద్దీ తప్పనిసరి పరిస్థితుల్లో రూ.500ల నుంచి రూ.1,500ల వరకు డబ్బులు ముట్టజెప్పి ఈకేవైసీ చేసుకుంటున్నారు. ఈ విషయం శనివారం కాంట్రగడలో వెలుగు చూసింది. కొంత మంది ప్రశ్నిస్తే తిరిగి దబాయించే ప్రయత్నం చేశారు. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న వారికి కూడా డబ్బులు తీసుకొని ఈకేవైసీ చేయిస్తున్నాడని స్థానికులు చెబుతున్నారు. పలాస తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తిని వివరణ కోరగా ఈ విషయం తనకు తెలియదని, ఇది నిజమైతే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కిరాతకానికి పరాకాష్ట -8లో

శ్మశానమే వ్యాపార స్థావరం -8లో

రేపటి గ్రీవెన్స్ రద్దు

శ్రీకాకుళం క్రైమ్ : రంజాన్‌ను పురస్కరించుకుని సోమవారం నిర్వహించాల్సిన గ్రీవెన్స్‌సెల్ రద్దు చేసినట్లు శ్రీకాకుళం జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. అలాగే ఎస్పీ గ్రీవెన్స్ కూడా రద్దు చేసినట్లు ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు

సంతబొమ్మాళి: మండలంలోని ఉపాధి పనుల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో చేపట్టిన రూ.26.22 కోట్ల విలువైన ఉపాధి పనులపై శనివారం సోషల్ ఆడిట్ ప్రజా వేదిక నిర్వహించారు. దాదాపు రూ. 4.33 కోట్ల అవినీతి జరిగినట్లు సోషల్ ఆడిట్ బృందం గుర్తించింది. ఈ నెల 15 నుంచి 28వ తేదీ వరకు సోషల్ ఆడిట్ బృందాలు గ్రామాల్లో తనిఖీలను నిర్వహించి ఈ లెక్కలు వేశాయి. ఆకాశలక్కవరం, లక్కివలస, చిన్న తుంగాం పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులపై ఏపీడీ మళ్లీ ఎంక్వైరీ చేసి రిపోర్టు ఇవ్వాలని డ్వామా పీడీ సుధాకర్ ఆదేశించారు.

క్లుప్తంగా

పార్టీలో ఉంటూ ద్రోహం చేస్తే మనుగడ కష్టం

● మంత్రి అచ్చెన్నాయుడి వివాదాస్పద వ్యాఖ్యలు

శ్రీకాకుళం: టీడీపీలో ఉంటూ ద్రోహం చేసిన వారికి పార్టీలో మనుగడ, గుర్తింపు ఉండదని, దీనికి జిల్లాలోని రాజకీయమే నిదర్శనమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. పట్టణంలో శనివారం జరిగిన ఆ పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేస్తామని, చనిపోయిన తర్వాత పార్టీ జెండానే కప్పాలని చెప్పిన నాయకులే పార్టీకి ద్రోహం చేసేలా వ్యవహరించారని వ్యాఖ్యానించారు. గతంలో శ్రీకాకుళం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదన్న బాధ తనలో ఉండేదన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే గొండు శంకర్ తమతో కలసి వస్తుండడంతో జిల్లా కేంద్రాన్ని అభివృద్ధి చేయగలుగుతున్నామని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలన్నీ పరోక్షంగా గుండ కుటుంబీకులను ఉద్దేశించి చేసినట్లుగా ఉన్నాయని సభకు హాజరైన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

'రికార్డు'కెక్కిన రాళ్లపాడు పాఠశాల



హెచ్ఎంకు అవార్డు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

పోలాకి: తెలుగు రాష్ట్రాల్లో ప్రతిభను ప్రోత్సహించే 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్' సంస్థ పోలాకి మండలం రాళ్లపాడు ప్రాథమిక పాఠశాలకు అవార్డును అందజేసింది. శనివారం సంస్థ ప్రతినిధి కె.రామకృష్ణరాజు పాఠశాలను సందర్శించి విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. ఇక్కడి విద్యార్థులు 118 రసాయన మూలకాల పేర్లు చెప్పటంతోపాటు, 20 అంకెల సంఖ్యల వర్గమూలాలు కట్టడం,' పై'విలువను 100 స్థానాల వరకు చెప్పటం, 360 డిగ్రీల వరకు త్రికోణమితి విలువలు చెప్పడం, ఎలక్ట్రానిక్ విన్యాసాలు రాయటం, పై తరగతులకు చెందిన అనేక గణిత సమస్యలను సైతం సులువుగా సాధించటం తదితర అంశాల్లో ప్రతిభను సంస్థ గుర్తించింది. అందులో భాగంగానే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బంటుపల్లి ధనుంజయదేవ్ కు తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అవార్డును అందించారు. ఈ బడిని నాడు-నేడు నిధులతో అభివృద్ధి చేశారు. ఆ ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని సర్పంచ్ బోర సోమేశ్వరరావు అన్నారు.

కిరాతకానికి పరాకాష్ట

● గర్భిణీ దారుణ హత్య
● ఆర్.కరాపాడులో దుర్ఘటన
● గ్రామ శివారులో దుండగుల దుశ్చర్య
● పరారీలో మృతురాలి భర్త



మీనాక్షి మృతదేహం (ఇన్‌సెట్లో) మీనాక్షి (ఫైల్)

కవిటి:

మండలంలోని ఆర్.కరాపాడులో అమానుష ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఐదు నెలల గర్భిణీ కొంతాల మీనాక్షి శుక్రవారం రాత్రి 8 నుంచి 9 గంటల సమయంలో గ్రామ శివారులోని రైల్వేగేటు వద్ద దుండగుల దాడిలో హత్యకు గురయ్యింది. మృతురాలి తండ్రి బోడయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని కవిటి ఎస్ఐ వి.రవివర్మ తెలిపారు.

ఆస్పత్రి నుంచి వస్తుండగా...



దాడి అనంతరం ఆస్పత్రికి భార్యను తీసుకొచ్చిన తర్వాత బెడ్‌పై కూర్చున్న భర్త దిలీప్

పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తన భార్య మీనాక్షి ఐదు నెలల గర్భిణీ కావడంతో సాయంత్రం 6 గంటల సమయంలో సోంపేటలోని ఒక వైద్యుడి వద్దకు వైద్య పరీక్షల నిమిత్తం భర్త కొంతాల దిలీప్ తీసుకెళ్లాడు. అనంతరం ఇంటికి వస్తుండగా గ్రామ సమీపంలోని రైల్వే గేటు దాటిన తర్వాత, వారి వాహనాన్ని కొంతమంది దుండగులు అడ్డగించి దాడి చేశారు. అతికిరాతకంగా మీనాక్షి తల, పొట్ట, ముఖంపై తీవ్రగాయాలయ్యేలా కొట్టారు. ఈ ఘటన జరిగిన కొంత సమయానికి సమాచారం అందుకున్న గ్రామస్తులు పరుగున సంఘటన స్థలానికి వచ్చారు. వెంటనే మీనాక్షి భర్త దిలీప్, గ్రామస్తులు ఆమెను సోంపేట ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. ఆస్పత్రికి తీసుకెళ్లే సమయానికే మీనాక్షి చనిపోయిందని వైద్యులు ధ్రువీకరించారు. తమ బిడ్డ మరణించిందన్న విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. సోంపేట సీహెచ్‌సీలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. అయితే ప్రస్తుతం మృతురాలి భర్త దిలీప్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఈ కేసును ఇచ్ఛాపురం సీఐ ఎం.చిన్నంనాయుడు దర్యాప్తు చేస్తున్నట్టు కవిటి ఎస్ఐ రవివర్మ తెలిపారు.

కిరాతకంగా చంపేశారు

ఐదు నెలల నిండు గర్భిణి అనే కనికరం కూడా లేకుండా అత్యంత పాశవికంగా తన బిడ్డ మీనాక్షిని కడతేర్చారని ఆమె తండ్రి బి.బోడయ్య తెలిపారు. గర్భిణీ అనే జాలి కూడా లేకుండా కడుపు మీద పిడి గుద్దులు, కాలిబూట్లతో గాయపరిచిన ఆనవాళ్లు కనిపించాయని కన్నీటి పర్యంతమయ్యారు. ఐదేళ్ల క్రితం ప్రేమపేరుతో తన కూతురిని పెళ్లి చేసుకున్న దిలీపే ఈ దారుణానికి పాల్పడ్డాడని విమర్శించారు. ముక్కుపచ్చలారని మూడేళ్ల పాపాయి ఝాన్సీ (మీనాక్షి కుమార్తె) అమ్మకు ఏమైంది అని అడుగుతుండడంతో స్థానికుల గుండె చెరువైంది. అయితే ఈ ఘటనపై గ్రామంలో పలువిధాలుగా చర్చించుకుంటున్నారు. ఈ ఘటనకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులను రూ.2 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా ఈ దాడి వెనుక ఉన్నటువంటి వారిని కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.



సోంపేట ఆస్పత్రి ఆవరణలో కుటుంబ సభ్యుల రోదనలు

శ్మశానమే వ్యాపార స్థావరం



● శ్మశానంలో గంజాయి విక్రయిస్తున్న ప్రబుద్ధులు
● 21 కిలోల గంజాయితో పోలీసులకు దొరికిన యువకులు
● ఒడిశాలో కొని ఆంధ్రాలో అమ్మకం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైమ్ : ఎవరూ ఉండరు, ఎవరూ రారని అనుకున్నారేమో జిల్లా కేంద్రంలో కొందరు ప్రబుద్ధులు శ్మశానాన్ని గంజాయి వ్యాపారానికి స్థావరంగా మార్చుకున్నారు. ఒడిశాలో కొని ఇక్కడ అమ్మేందుకు శ్మశానాన్ని అడ్డాగా చేసుకున్నారు. చివరకు అదే శ్మశానంలో ఖాకీల చేతికి చిక్కారు. శ్రీకాకుళం సబ్‌డివిజన్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ కేసుకు సంబంధించి తొమ్మిది మందిని అరెస్టు చేశారు. అందులో ఐదుగురిని రిమాండ్‌కు పంపించారు. ఈ మేరకు సబ్‌డివిజనల్ కార్యాలయంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద శనివారం సాయంత్రం పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు..

ఒడిశా గంజాం జిల్లాకు చెందిన కైలాష్ చంద్ర బెహరా, సంతోష్‌కుమార్ మహంతిలు అదే రాష్ట్రంలోని కందమాల్ జిల్లా బరంపురం సమీప సరంగుడం వద్ద తక్కువ ధరకే గంజాయిని కొంటుంటారు. అదే గంజాయిని శ్రీకాకుళం నగరానికి తెచ్చి ఇదివరకే పరిచయమున్న గుడియా కాళీ అనే యువకునికి అమ్ముతుంటారు. కాళీ సరకు తేవడానికి అతని స్నేహితుడు యడ్ల దిలీప్ కుమార్ (పాత్రుని వలస) సహకరించేవాడు. తెచ్చాక ప్యాకెట్లలో అమర్చి గంజాయి వ్యసనపరులకు అమ్మేందుకు వీరితో పాటు బొత్తల చిన్నారావు (శ్రీకాకుళం) సాయపడేవాడు.

అంతా శ్మశానంలోనే..

ఈ ముగ్గురూ రహస్యంగా జిల్లాకేంద్రంలోని రెల్లి వీధి సమీప రోటరీ క్లబ్ శ్మశానంలోని తుప్పల్లో గంజాయి తాగుతూ అక్కడే అమ్ముతుండేవారు. వీరికి కొన్నేళ్ల క్రితం పరిచయమైన గంగాడ లోకేష్ (పాత్రునివలస), జలగడుగుల రాకేష్ (శ్రీకాకుళం టౌన్), సైలాడ వేణుగోపాల్ అలియాస్ వేణు (మండలవీధి), కొత్తపల్లి భీమరాజు అలియాస్ భీమ అనే యువకులకు గంజాయిని ఎక్కువ ధరకు ప్యాకెట్లలో అమ్మేవారు.

ఎలా పట్టుబడ్డారంటే..

రెండో పట్టణ ఎస్ఐ సంతోష్‌కుమార్‌కు శనివారం రోటరీ క్లబ్ శ్మశానంలో గంజాయితో యువకులు ఉన్నారన్న సమాచారం రావడంతో మధ్యాహ్నం 12 గంటలకు సిబ్బందితో చేరుకున్నారు. పైన పేర్కొన్న తొమ్మిది మంది అక్కడే తుప్పల మధ్య రెండు గోనెసంచులతో ఉండటం , పోలీసులు చుట్టుముట్టడంతో పారిపోవడానికి ప్రయత్నించినా చాకచక్యంగా పట్టేశారు. అనంతరం స్టేషన్‌కు తీసుకెళ్లి సీఐ పి.ఈశ్వరరావు సమక్షంలో ఎస్ఐ విచారణ చేపట్టి మొత్తం విషయాన్ని లాగారు.

రౌడీషీట్లతో పాటు పోక్సో కేసులు సైతం..

పోలీసుల విచారణలో నగరానికి చెందిన గుడియా కాళీపై ఆరు కేసులుండటమే కాక 2023లో పోక్సో కేసు కూడా నమోదైంది. ఓ కేసు విషయం రిమాండ్‌లో ఉన్న సమయంలో రిమ్స్‌లో చికిత్సకోసం వెళ్లి అక్కడి పోలీస్ ఎస్కార్ట్ నుంచి తప్పించుకున్నాడు కూడా. అప్పుడే టూటౌన్‌లో రౌడీషీట్ సైతం నమోదైంది. ఇతనితో పాటు యడ్ల దిలీప్‌కుమార్‌పై కూడా వివిధ కేసుల్లో రౌడీషీట్, పోక్సో కేసు సైతం నమోదై ఉంది. ఒడిశాకు చెందిన కైలాస్ చంద్ర బెహరా ఆటో నడుపుతుంటాడు. ఇచ్ఛాపురంలో ఒక కేసు, ఒడిశాలో మరో కేసు ఉంది. గంజాయి విక్రయదారులను పట్టుకున్న సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ సంతోష్‌కుమార్, ఇతర పోలీసు సిబ్బందిని డీఎస్పీ వివేకానంద అభినందించారు. అనంతరం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు.

అభివృద్ధిని ఎందుకు అడ్డుకుంటున్నారు..?

● ప్రతిపాదనలపై స్పందించరా..?
● ధ్వజమెత్తిన దువ్వాడ వాణి
● సర్వసభ్య సమావేశం బహిష్కరణ



సమావేశంలో నిరసన తెలుపుతున్న జెడ్పీటీసీ దువ్వాడ వాణి తదితరులు

టెక్కలి: నియోజకవర్గంలో అభివృద్ధిని అధికారులు ఎందుకు అడ్డుకుంటున్నారని జెడ్పీటీసీ దువ్వాడ వాణి తదితరులు ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆట్ల సరోజనమ్మ అధ్యక్షతన, ఎమ్మెల్సీ నర్తు రామారావు ముఖ్య అతిథిగా మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా సమీక్ష నిర్వహిస్తున్న క్రమంలో భాగంగా దువ్వాడ వాణి మాట్లాడుతూ.. మండలంలో ఎంపీటీసీలు వారి ప్రాదేశికాల అభివృద్ధి కోసం గతంలో ఇచ్చిన ప్రతిపాదనలపై ఎందుకు తాత్సారం చేస్తున్నారని అధికారులను నిలదీశారు. దీంతో మిగిలిన సభ్యులంతా ఆమెతో గొంతు కలిపారు. అంతేకాకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వివిధ అభివృద్ధి పనుల కోసం చెల్లించిన డిపాజిట్లు సైతం తిరిగి ఇవ్వడం లేదంటూ మండిపడ్డారు. ప్రజాప్రతినిధులు చేసిన ప్రతిపాదనలపై శాఖాపరంగా పనుల గుర్తింపు ఆమోదం ఇస్తే తప్ప, సమావేశాన్ని ముందుకు కొనసాగించేది లేదంటూ సభ్యులంతా బైఠాయించారు. అనంతరం సమావేశాన్ని బహిష్కరిస్తూ ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీబాయికి తీర్మానం కాపీ అందజేశారు.

గతంలో ఇబ్బందులు ఉండేవి కాదు

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఇటువంటి ఇబ్బందులు ఉండేవి కాదని గుర్తు చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందేవని, అభివృద్ధి కార్యక్రమాలు పక్కాగా చేపట్టేవారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేస్తూ పాలన సాగిస్తోందని మండిపడ్డారు. అధికారులు ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని, లేని పక్షంలో ఇబ్బందులు ఎదుర్కొంటారని హితవు పలికారు. సభ్యులు కోరిన విధంగా ప్రతిపాదనలపై తక్షణమే పనులు గుర్తించి పరిపాలన ఆమోదం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఎం.కిషోర్, సభ్యులు ఎస్.ఉషారాణి, ఆర్.బృందావతి, బి.దేవయాని, వి.శ్రీధర్‌రెడ్డి, పి.పాల్గుణరావు, ఆర్.జయమోహన్, పి.మోహన్‌రావు, జి.మోహన్ రెడ్డి, ఎం.శంకర్, జి.రాజేష్, బి.రాకేష్, కె.కామేష్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షుల నియామకం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్ల విభాగం అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వీరిని నియమించారు.

అధ్యక్షుడు	నియోజకవర్గం
భవిరి రమణ	ఎచ్చెర్ల
యరబాటి వెంకటరమణ	నరసన్నపేట
మోదుగువలస గణపతిరావు	టెక్కలి
మద్దు తాతయ్య	పాతపట్నం
కంచరాణ చినబాబు	పలాస
పండి కృష్ణారావు	ఇచ్ఛాపురం

అట్రాసిటీ చట్టాలపై దిశానిర్దేశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: అట్రాసిటీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం పౌర హక్కుల పరిరక్షణ, అత్యాచార నిరోధక చట్టంపై జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీతో ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, నరసన్నపేట పేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి సమీక్ష నిర్వహించారు. అట్రాసిటీ కేసుల పరిష్కారం ఆలస్యం కాకూడదన్నారు. సోషల్ వెల్ఫేర్ డీడీ విశ్వ మోహన్ రెడ్డి గత సమావేశంలో అంశాలపై చేపట్టిన పనులు వివరించారు.

డీఈవోను తప్పించాల్సిందే

శ్రీకాకుళం న్యూకాలనీ: కుప్పిలి మోడల్ స్కూల్ కాపీయింగ్ ఉదంతానికి సంబంధించి డీఈవో తిరుమల చైతన్యను విధుల నుంచి తప్పించాలని జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సాయంత్రం జిల్లా డీఈవో కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా విద్యాశాఖ అధికారిని బాధ్యతల నుంచి తక్షణమే తప్పించాలని, మిగిలిన నలుగురు ఉపాధ్యాయుల సస్పెన్షన్లను ఎత్తివేయాలని, కోర్టు కేసులను వెనక్కి తీసుకోవాలని, డిబారైన విద్యార్థులకు సప్లిమెంటరీకి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి వేదిక ప్రతినిధులు చౌదరి రవీంద్ర, మజ్జి మదన్‌మోహన్, తంగి మురళీమోహన్, మొజ్జాడ వెంకటరమణ, డి.శివరామ్‌ప్రసాద్, పిసిని వసంతరావు, ఎస్వీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక స్టీరింగ్ కమిటీ ముఖ్య ప్రతినిధులు చౌదరి రవీంద్ర అధ్యక్షతన ఎన్జీవో హోమ్‌లో సమావేశమయ్యారు. ఈనెల 3వ తేదీన జరిగే పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్‌ను బహిష్కరించనున్నట్లు స్పష్టం చేశారు.



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పేదోడి కలను కూల్చేశారు..!

● జగనన్న కాలనీలో ఇంటి పునాదులు కూల్చివేత
● వైఎస్సార్‌సీపీ నాయకులతో తిరగడంపై కక్ష సాధింపు



బాధితురాలితో మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: కూటమి ప్రభుత్వంలో సామాన్యులపై కక్ష సాధింపు చర్యలు మితిమీరిపోతున్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు, దళితులు, ఉద్యోగులతో పాటు సామాన్య ప్రజలపై కక్షగట్టి మరీ దారుణాలకు పాల్పడుతున్నారు. తాజాగా మంత్రి అచ్చెన్నాయుడు సొంత మండలం కోటబొమ్మాళి మండలం యలమంచిలి పంచాయతీ మామిడివానిపేట గ్రామంలో దారుణమైన ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వీరఘట్టపు భాస్కరరావు అనే వ్యక్తి వైఎస్సార్‌సీపీ నాయకులతో తిరుగుతుండడంతో కక్షగట్టారు. దీంతో గత ప్రభుత్వంలో జగనన్న కాలనీలో వేసిన ఇంటి పునాదులను నిలువునా కూల్చేశారు. శనివారం తెల్లవారుజామున ఒక్కసారిగా గ్రామంలోకి ప్రవేశించి ఇంటి పునాదులను కూల్చివేసి భయానక వాతావరణాన్ని సృష్టించారు. అయితే ఈ ఘటన జరుగుతున్న సమయంలో బయటకు సమాచారం చెప్పకుండా పక్కింటి వ్యక్తితో పాటు అతని సెల్‌ఫోన్‌ను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది జనవరిలోనే పునాదులను కూల్చివేసే ప్రయత్నం చేయగా, అప్పట్లో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకున్నారు. అంతేకాకుండా బాధితుడు తరపున కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతానికి స్థలం సమస్య కోర్టులో పెండింగ్ ఉండగానే మరోసారి అధికారులు తమ ప్రతాపాన్ని చూపించారు.

బాధితులకు అండగా తిలక్

ఘటన విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలిచారు. టెక్కలి నియోజకవర్గంలో మంత్రి అచ్చెన్నాయుడు ప్రోత్సాహంతో టీడీపీ కార్యకర్తలు దారుణాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. స్థలం సమస్య కోర్టులో పెండింగ్ ఉండగా, అధికారుల అత్యుత్సాహ ప్రదర్శనకు తగిన మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. తక్షణమే కూల్చిన చోట ఇంటి నిర్మాణం చేపట్టాలని, లేకుంటే తీవ్రమైన పరిణామాలు జరుగుతాయని హెచ్చరించారు. ఆయనతోపాటు కోటబొమ్మాళి జెడ్పీటీసీ దుబ్బ వెంకట్రావు, నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, నాయకులు అన్నెపు రామారావు, రోణంకి ఉమా మల్లయ్య, పేడాడ వెంకట్రావు తదితరులు ఉన్నారు.

నేడు, రేపు కూడా విద్యుత్ బిల్లుల కలెక్షన్లు

అరసవల్లి: తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విద్యుత్ వినియోగదారులు నేడు (ఉగాది), రేపు (రంజాన్) కూడా జిల్లాలో అన్ని ఈఆర్వో కార్యాలయాల్లో విద్యుత్ బిల్లులు చెల్లించుకోవచ్చని ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలియజేశారు. వరుసగా రెండు రోజులు సెలవు రోజులే అయినప్పటికీ విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం కలెక్షన్ కేంద్రాలు పనిచేసేలా చర్యలు చేపట్టామని ఆయన వివరించారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్‌లోని ఏపీ మహిళా ఆర్థిక సహకార సంస్థ నిర్వహిస్తున్న ఎన్టీఆర్ నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రంలో నైపుణ్య శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంగణం మేనేజర్ పి.విమల శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హోటల్ మేనేజ్‌మెంట్, కంప్యూటర్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, ఇంగ్లిష్ స్కిల్స్‌లో నాలుగు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 89788 20079, 93306 77966 నంబర్లను సంప్రదించాలని సూచించారు.